# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-05-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు.**
2. **పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ నిపుణుల బృందం ఈరోజు సందర్శించి.. అక్కడ జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను పరిశీలించింది.**
3. **ప్రజారోగ్య పరిరక్షణ, పిల్లలకు ఆహ్లాదం కోసం పార్కులను ఆధునీకరిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు.**
4. **అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతినకుండా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రైతులకు సూచించారు.**
5. **రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు.**

==========================

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా పొన్నలూరులో నిర్వహించిన రెవెన్యూ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తామని వెల్లడించారు.

--------------------------

కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేఖ రాసింది. ఈరోజు త్రిసభ్య కమిటీ సమావేశానికి హాజరు కాలేమని అందులో పేర్కొంది. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు నిపుణులు వస్తున్నారని అందులో వివరించింది. ఈ నెల 10 తర్వాత త్రిసభ్య కమిటీ భేటీ ఏర్పాటు చేయాలని ఏపీ ఈఎన్‌సీ కోరారు. ఇకపై కృష్ణా బోర్డు సమావేశాలు విజయవాడలోనే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

--------------------------

పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ నిపుణుల బృందం సందర్శించింది. అక్కడ జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. అంతర్జాతీయ నిపుణుల బృందంతో పాటు పీపీఏ సభ్య కార్యదర్శి

ఎం.రఘురాం, కేంద్ర జలసంఘం అధికారులు పనులు జరుగుతున్న తీరుపై సమీక్షించారు. ప్రాజెక్టు అధికారులు పనుల పురోగతిని వారికి వివరించారు. నిపుణుల బృందం ఈరోజు నుంచి 8వ తేదీ వరకు వాల్ పనుల్లో నాణ్యత, ఈసీఆర్ఎఫ్ డ్యాం డిజైన్లు పరిశీలిస్తారు. అనంతరం ఈ బృందం జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు తగు సూచనలు, సలహాలను ఇవ్వనుంది.

-----------------------------

అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతినకుండా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రైతులకు సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధకశాఖ అధికారులతో నిన్న మాట్లాడారు. అకాలవర్షాల వల్ల కోతకొచ్చిన మామిడి తోటలకు అధిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున, పంట నష్టం నివారణకు తీసుకోవా ల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. పంట నష్టాలపై కూడా అంచనా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించాలన్నారు. రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అకాల వర్షాల వల్ల నష్టం వాటిల్లే పంటలను ముందుగా గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచించాలని ఆదేశించారు.

-----------------------------

ప్రజారోగ్య పరిరక్షణ, పిల్లలకు ఆహ్లాదం కోసం పార్కులను ఆధునీకరిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని తిక్కన పార్కులో ప్లే, జిమ్ ఎక్విప్‌మెంట్‌లను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. 2018లోనే 100 పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. గత ప్రభుత్వం పార్కుల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని పార్కులన్నీ ఆధునీకరించి.. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటుచేస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

-----------------------------

రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. నిన్న ఆయన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. భారీ వర్షానికి తోడు ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలు నేలకొరిగే అవకాశం ఉందని సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాటిని వెంటనే సరి చేయాలన్నారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.

-----------------------------

రాష్ట్రంలో మరో రెండు రోజుల వరకు భిన్నమైన వాతావరణ పరిస్థితులు కొనసాగనున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. ఈరోజు అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మరోవైపు రానున్న రెండు రోజులు కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు 41 నుంచి 42 డిగ్రీల సెంటీగ్రేటెడ్ మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉందన్నారు.... వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటాయని వాతావరణ కేంద్రం ప్రకటించిన క్రమంలో.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్.టి.ఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే కలెక్టరేట్లోని కంట్రోల్ రూమ్ నంబర్ 91549 70454కు తెలిజేయాలని ఆయన తెలిపారు.

---------------------------

అకాల వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో కోతలు పూర్తి చేసిన ధాన్యం సేకరణ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు పై నిన్న టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటి వరకు 2 లక్షల 79 వేల 689 మెట్రిక్ టన్నుల ధాన్యం కోతలు పూర్తి చెయ్యడం జరిగిందన్నారు. వాటిలో 16 వేల 613 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని, ప్రస్తుతం వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులకు తగిన సూచనలు ఇవ్వడం, ధాన్యం మిల్లులకు తరలించడంపై దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు.

---------------------------

రేపు ఏపీ ఈసెట్ పరీక్ష జరగనుంది. ఇప్పటికే రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మద్యా హ్నం 12 గంటల వరకు.. అలాగే.. మద్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల 187 మంది పరీక్షకు హాజరుకానున్నారు. మొత్తం 110 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

కాగా .. మే 7న ఏపీ ఐసెట్-2025 ప్రవేశపరీక్షను రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల 30 నిమిషాల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల 30 నిమిషాల వరకు రెండో సెషను నిర్వహించనున్నారు. మే 10న ప్రిలిమినరీ కీ విడుదల చేసి మే 12 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఆ తర్వాత మే 21న ఐసెట్ ఫలితాలు వెల్లడించనున్నారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల గ్రామ, వార్డు సచివాలయాల్లో రెండు విడతల్లో ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్టు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈరోజు నుంచి 8వ తేదీ వరకు ఒక విడతలో, 12 నుంచి 15వ తేదీ వరకు మరో విడతలో గ్రామ, వార్డు సచివాలయాలు, వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్టు పేర్కొంది. 5 నుంచి 7 ఏళ్ల మధ్య, 15 నుంచి 17 ఏళ్ల మధ్య వయసుగలవారు ఈ ప్రత్యేక క్యాంపుల్లోని సేవలను ఒక్కసారి ఉచితంగా ఉపయోగించుకోవచ్చని తెలిపింది.

---------------------------

తిరుమలలో పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు రేపటి నుంచి 8వ తేదీ వరకు తిరుమలలో ఘనంగా నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. మూడురోజులపాటు జరుగనున్న ఈ వేడుకలో తొలిరోజు శ్రీ మలయప్పస్వామివారు గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై భక్తులకు దర్శనం ఇస్తారు. ఆ తరువాత కల్యాణమహోత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తారు. పద్మావతి పరిణయోత్సవాల నేపథ్యంలో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేసిట్లు టిటిడి తెలిపింది.

---------------------------

ప్రజలకు, కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే న్యాయస్థానాల ప్రధాన లక్ష్యమని హైకోర్టు

న్యాయమూర్తి, ప్రకాశం జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి జస్టిస్ రాజశేఖర్‌రావు అన్నారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండలో సివిల్ జడ్జి – జూనియర్ డివిజన్ కోర్టు ప్రారంభోత్సవం నిన్న జరిగింది. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజశేఖర్‌రావు, జస్టిస్ కే. మన్మథరావు, జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్, జస్టిస్ వై. లక్ష్మణరావు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో జస్టిస్ రాజశేఖర్‌రావు మాట్లాడుతూ... బార్ అసోసియేన్ సభ్యులు లక్ష్యానికి అనుగుణంగా, కలిసికట్టుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నూతన సివిల్ జడ్జి కోర్టుకు రెగ్యులర్ న్యాయాధికారిని నియమించడానికి కృషి చేస్తానని తెలిపారు.

======================